ఆహ్లాదం.. ఆరోగ్యం



పిల్లల సందడితో కళకళలాడుతున్న సరస్వతీ పార్కు

పార్కులు ఆహ్లాదానికి.. ఆరోగ్యానికి బెంచ్ మార్కులు. పార్కులు లేని కాలనీలను ఊహించలేం. అటువంటి పార్కులు నియోజకవర్గంలో చాలా ఉన్నప్పటికీ ముఖ్యంగా సరస్వతీ పార్కు, డైమండ్ పార్క్, గోకుల్ పార్క్ ఎన్నదగినవని చెప్పొచ్చు. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు పలు రకాల ఆట వస్తువులతో పాటు పెద్దలు వ్యాయామం చేసేందుకు పరికరాలు, వాకర్లకు వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేసి ఆహ్లాదం.. ఆరోగ్యం ఒకేసారి అందిస్తున్నారు.



కళకళలాడుతున్న గోకుల్ పార్క్

- చిన్నాపెద్ద.. అందర్నీ ఆకట్టుకుంటున్న పార్కులు
- వాకింగ్ ట్రాక్‌లు.. ఆట వస్తువులతో ప్రత్యేక ఆకర్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కబడ్డీ ఆడుతున్న చిన్నారులు



పిల్లలకే కాదు.. పెద్దలకూ వ్యాయామమే

దాబాగార్డెన్స్ : ఆహ్లాదానికి.. ఆరోగ్యానికి పార్కులు చిరునామాగా నిలుస్తున్నాయి. నిత్యం పని ఒత్తిడిలో ఉండే వారికి పార్కులు రిలీఫ్ ఇస్తాయి. అలాంటి పార్కులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విశాఖ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా నగర సుందరీకరణ పనులు వేగవంతం చేశారు.

రూ.కోటీ 9 లక్షలతో గోకుల్ పార్క్..

బీచ్‌రోడ్డులో గోకుల్ పార్క్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. రూ.కోటీ 9 లక్షలతో పార్కును అభివృద్ధి బాట పట్టిస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో రూ.30.50 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ఏడాది రూ.78.61 లక్షలతో మరింత అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించారు. పార్కులో సేదదీరేందుకు పాలరాతి బల్లలు, వాకర్ల కోసం వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేశారు. మరీ ముఖ్యంగా బీచ్ పర్యాటకులు.. నగరవాసులను ఆకట్టుకునేలా రాధాకృష్ణుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. మురళీగానంతో పార్కు ముందర ఏర్పాటు చేసిన నమూనా ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ పార్కుకు ప్రతి ఏటా కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి రోజున యాదవ కులస్థులు యదుమేళా నిర్వహిస్తుంటారు. పాలు పెరుగు.. వివిధ రకాల ద్రవ్యాలతో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

సరస్వతీ పార్క్..

డైమండ్‌పార్కు, సరస్వతి పార్కులో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు (ఓపెన్ జిమ్) అన్ని వర్గాల ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని ఇస్తున్నాయి. రెండేళ్ల బాలుడి నుంచి ఏడు పదుల వయస్సు వారి వరకు జీవీఎంసీ ఏర్పాటు చేసిన లెగ్ ఎక్సైజ్, బాడీ బిల్డింగ్, హ్యాండ్ ఎక్సైజ్, వాకింగ్, స్టమక్ ఎక్సైజ్ వంటి పరికరాలను ఉపయోగించుకుంటున్నారు. ఇక్కడ కబడ్డీ గ్రౌండ్ కూడా ఏర్పాటు చేశారు. కబడ్డీ ఆడుతున్నప్పుడు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు అడుగు ఎత్తులో ఇసుక వేశారు.

అభిమానులకు కేరాఫ్‌గా..

సినీ అభిమానులకు కేరాఫ్‌గా సరస్వతీ పార్క్ నిలుస్తోంది. కొత్త సినిమా వచ్చిందంటే చాలు సినిమా రిలీజ్‌కు ముందు.. సక్సెస్ అయి కొద్ది రోజులు ఆడిన తర్వాత అభిమాన సంఘాలు ఇక్కడే సమావేశమవుతుంటాయి. అలాగే సినీ హీరోల జన్మదినోత్సవ కార్యక్రమాలు కూడా ఇక్కడే జరుపుకుంటున్నారు. కేక్ కటింగ్ నుంచి మధ్యాహ్నం అన్నసమారాధనలు.. సాయంత్రం ఆర్కెస్ట్రాలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు జరుపుకునే సమావేశాలకు సరస్వతీ పార్క్ నిలయంగా మారింది. మరీ ముఖ్యంగా ఎల్ఐసీ నుంచి పాతనగరానికి వెళ్లే వారికి సరస్వతీ పార్కు చక్కటి దిక్సూచిలా పని చేస్తోంది. సరస్వతీ పార్కు నుంచి ఫలానా వైపు వెళ్తే ఫలానా ప్రాంతం వస్తుందని ఎవరైనా సులువుగా చెప్పగలుగుతారు.

సరస్వతీ పార్క్



- ఆకట్టుకునే వ్యాయామ పరికరాలు
- కబడ్డీ గ్రౌండ్ ఏర్పాటు
- సినిమా వేడుకల నిర్వహణ
- ఆర్కెస్ట్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ



డ్రైవింగ్ చేస్తున్నట్టు వ్యాయామం చేస్తున్న చిన్నారులు

గోకుల్ పార్క్



- రూ. కోటీ 9 లక్షలతో అభివృద్ధి
- మొదటి విడతలో రూ. 30.50 లక్షల కేటాయింపు
- తర్వాతి దశలో రూ.78.61 లక్షల కేటాయింపు
- రాధాకృష్ణుల విగ్రహాలు, పాలరాతి బల్లలు, వాకింగ్ ట్రాక్ ప్రత్యేక ఆకర్షణ

కబడ్డీ ఆడుతాం..



పిల్లలు ఆడుకునేందుకు పార్కులో మంచి ఆట వస్తువులు.. కబడ్డీ ఆడుకునేందుకు ఇసుక వేసారు. మేమందరం సరదాగా ఆడుకుంటున్నాం. ఫ్రెండ్స్ అందరం ఇతర ఆటలతో పాటు కబడ్డీ కూడా ఆడి ఎంజాయ్ చేస్తున్నాం..

–గౌతమ్, విద్యార్థి

ఫ్రెండ్సంతా ఎంజాయ్ చేస్తాం..



ఆదివారం వస్తే బాగా ఎంజాయ్ చేస్తాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా ఆడుకుంటాం. మా ఫ్రెండ్స్ కూడా ఈ పార్కుకి వస్తుంటారు. ఇక్కడి ఆట వస్తువులంటే నాకు చాలా ఇష్టం. ఈ పార్కులో అన్ని రకాల ఆటలూ ఆడుతాను.

–వర్రి అరుణ్ సుహాస్ తేజ్, 6వ తరగతి, పెన్‌స్కూల్

క్లుప్తంగా

ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయం తరలింపు



జనతాబజార్ వద్ద ఏర్పాటు చేసిన ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయం

జగదాంబ : ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయాన్ని జనతాబజార్ వద్ద గల భవనంలోకి తరలించారు. భవనాల సదుపాయం లేకపోవడంతో ఇప్పటి వరకు ఈ సచివాలయాన్ని మున్సిపల్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు. అయితే ఇదే వార్డులో జనతాబజార్ వద్ద జీవీఎంసీకి చెందిన ఓ భవనం ఖాళీ కావడంతో అధికారులు దానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇందిరా మున్సిపల్ స్టేడియంలో ఉండే ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయాన్ని జనతాబజార్ వద్ద ఉన్న భవనంలోకి తరలించారు. ఈ సచివాలయానికి సంబంధించిన ప్రజలందరూ జనతాబజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయం సేవలు వినియోగించుకోవాలని సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి



పేదలకు చీరలు అందజేస్తున్న నిర్వాహకులు

జగదాంబ : వివేకానంద సంస్థలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా 98వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 39వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కేవీ శర్మ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కమల్, నండూరి రామకృష్ణ, రాథోడ్, పి.నారాయణ, డీఎస్ వర్మ, రాజ్‌కుమార్, అగర్వాల్, రవిశంకర్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతులకు ప్రభుత్వ సహకారం



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

అల్లిపురం : జీడి పప్పు రైతుల సాగు, ఎగుమతులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉద్యానవనశాఖ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ జీడిపప్పు దినోత్సవం సందర్భంగా గురువారం ఒక హోటల్లో ఆంధ్రప్రదేశ్ జీడిపప్పు తయారీదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీడిపప్పు ఉత్పత్తి, విలువ జోడింపు, ప్రాసెసింగ్‌లో యాంత్రీకరణ, రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తదితర అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో అపెడా అథారిటీ సభ్యుడు కె.పోలయ్య, ఏపీ జీడిపప్పు తయారీదారుల సంఘం అధ్యక్షుడు ఫణి రాఘవులు, సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలు వసూలు చేయాలి

జగదాంబ : నూరు శాతం యూజర్ చార్జీలు వసూలు చేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ అన్నారు. గురువారం జోన్–4 కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారంలో రెండు రోజులు బుధవారం, శనివారం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. మురికివాడల్లోనే ఎక్కువగా బకాయిలు ఉన్నాయని వాటిని కూడా వసూలు చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్స్ ద్వారా వచ్చే వసూలును కూడా వేగవంతం చేయాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న కోలా గురువులు



కోలా గురువులను సత్కరిస్తున్న అతిథులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్ట, శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గ్రంథాలయం ఆవరణలో ప్రతి రోజు అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన భిక్షలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొని భిక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా ఆయన గౌరీ పరమేశ్వరులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్, గ్రంథాలయం మాజీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, యల్లపు గోపాలరావు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఆయనను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదం అందజేశారు.

డైమండ్ పార్క్‌ను దత్తత తీసుకున్న ఏఐఎన్‌యూ ఆస్పత్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు నగరంలోని డైమండ్ పార్క్‌ను ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ ఆస్పత్రి యాజమాన్యం దత్తత తీసుకుంది. ఈ మేరకు పార్క్ అభివృద్ధికి ముందుకొచ్చిన ఆస్పత్రి ప్రతినిధులు డాక్టర్ పి. శ్రీధర్, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను పార్క్ వాకర్స్ అసోసియేషన్ అభినందించి సత్కరించింది. ఈ సందర్భంగా పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీవీఎంసీ సెక్రటరీ పల్లి నల్లనయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జోగారావు పట్నాయక్, కృష్ణకుమార్, విజయ్‌కుమార్, పీకే గుప్తా, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతంపై ఎమ్మెల్యే సంతోషం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నియోజకవర్గ నాయకులు

దాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతంపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కార్యాలయంలో గురువారం బస్సు యాత్ర సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. బస్సు యాత్ర విజయవంతం చేసిన నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనే జన సమూహం తరలి రావడానికి కారణమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, పేదలకు న్యాయం జరుగుతున్నందున, 2024 ఎన్నికల్లో కూడా మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి తీరుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 19.26 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 58 రోజులకు గాను రూ.19,26,851 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రి దేవదాయ ,ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి వసంత్ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హుండీ ఆదాయ లెక్కింపును పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, రామకృష్ణ, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

'విభజన హామీలపై మాట్లాడండి'

దాబాగార్డెన్స్: రాజకీయ పార్టీలు విభజన హామీలపై మాట్లాడాలని ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధులు ప్రొఫెసర్ అప్పలనాయుడు, చలసాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు కూడా ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విమర్శలే తప్పా..విభజన హామీలపై మాట్లాడడం లేదన్నారు. ఈ సమయంలో కూడా రాష్ట్రం కోసం పట్టించుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల నడుమ నాగచైతన్య జన్మదిన వేడుకలు



నిరాశ్రయులకు దుప్పట్లు అందజేస్తున్న రఘురాం, అక్కినేని ఫ్యాన్స్ ప్రతినిధులు

అల్లిపురం : అక్కినేని నాగార్జున, నాగచైతన్య, అఖిల్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సినీ హీరో అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలు భీమ్‌నగర్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు యల్లపు రఘురాం పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం నిరాశ్రయులకు దుప్పట్లు, క్రీమ్ బన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కినేని అభిమానులు నవీన్ ప్రసాద్, దిబ్బ శంకరరావు, ఎం.రాము, మరళీకృష్ణ యాదవ్, రాజు (సీట్ కవర్), జోజి యాదవ్, బొట్టా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



విశేష అలంకరణలో సిరి వినాయకుడు

అల్లిపురం : నేరెళ్లకోనేరులో వెలసిన శ్రీ సిరి వినాయక ఆలయ 21వ వార్షికోత్సవం బుధవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో భక్తులు ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతిని విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద దీపారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యవర్గ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ రోగులకు అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ చేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు

అల్లిపురం : ఆధ్యాత్మికత, సేవే పరమావధిగా పట్టా ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అన్నారు. సత్యసాయిబాబా 98వ జయంత్యుత్సవం సందర్భంగా పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో రోగులకు, వారి బంధువులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తరిస్తున్న ఫౌండేషన్ సభ్యులందరికీ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్‌బాబు, సభ్యులు బొడ్డేడ వెంకటలక్ష్మి, జి.దేముడుబాబు, ఆర్.భాస్కరరావు, దొడ్డి రమేష్, తాతా నాయుడు, అలీ, పెంటకోట శ్రీలక్ష్మి, శ్రీదేవీ, అఖిలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

- వైభవంగా ఏకాదశి పూజలు

అల్లిపురం : కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి గురువారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే వెంకన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజ, విశేష అభిషేకాలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో గల ధ్వజస్తంభానికి మహిళలు పూజలు చేశారు. సాయంత్రం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి జీవీ రమాబాయ్ తెలిపారు. డిసెంబర్ 23వ తేదీన జరగనున్న వైకుంఠ ఏకాదశికి పక్కాగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

అలిమేలు మంగమ్మ ఆలయంలో..

వేంకటేశ్వరమెట్టపై వెలసిన అలమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో గల ఉపాలయాలలో కూడా పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ టీఎఫ్ గౌరవ సలహాదారుడిగా త్రినాథరావు

విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా అల్లూరి జిల్లా అరుకు ఎంఈవో–1 వంతల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్ రెడ్డి, కార్యదర్శి సుధీర్ నియామకాన్ని ప్రకటించారు. గెజిటెడ్ అధికారి హోదా గల వంతల త్రినాథరావు సేవలను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకుంటామని వైఎస్సార్ టీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కలిసి సంఘం బలోపేతంపై తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఎమ్మెల్సీని సంఘం నాయకులు సత్కరించారు.

25 నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం



మాట్లాడుతున్న విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు

మహారాణిపేట : ఈనెల 25 నుంచి విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు చెప్పారు. గురువారం టర్నర్ సత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడుతూ టర్నర్ సత్రం వేదికగా జరగనున్న ఈ పుస్తక మహోత్సవాన్ని కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకట కుమారి, డీఈవో ఎల్. చంద్రకళ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రదర్శన డిసెంబర్ 15 వరకు కొనసాగుతుందన్నారు. ప్రజల్లో పుస్తక పఠనం పట్ల మక్కువ పెంచేలా విశాలాంధ్ర కృషి చేస్తోందన్నారు. మొత్తం 40 వేల రకాల టైటిల్స్ ఉంటాయన్నారు. చిన్న పిల్లల పుస్తకాల నుంచి పెద్దల పుస్తకాల వరకు ఇక్కడ లభ్యమవుతాయన్నారు. అన్ని పుస్తకాలపై 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. విశాఖలో ప్రథమంగా 1991లో విశాలాంధ్ర పుస్తక మహోత్సవం ఏర్పాటు చేస్తే ప్రజాదరణ పొందిందని తెలిపారు. పాఠకులు, పుస్తక ప్రియులు, సాహితీ పిపాసులు, విద్యార్థులు, గృహిణులు ఈ పుస్తక మహోత్సవానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.